సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 4 । జూన్ । 2023



విద్యుత్ డివిజనల్ కేంద్రంగా పలాస

జిల్లాలో పలాసలో కొత్త విద్యుత్ డివిజనల్ కేంద్రం ఏర్పాటైంది. దీంతో విద్యుత్ సేవలు మరింత విస్తరించనున్నాయి.

- 10లో



పరిశుభ్రంగా ఉంచుదాం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలో శనివారం పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

- 10లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	35°	30°
ఇచ్ఛాపురం	39°	28°
పాతపట్నం	36°	31°
శ్రీకాకుళం	36°	31°

హమ్మయ్యా.. అందరూ సేఫ్

● ఒకరు మృతి.. మరో ఇద్దరికి గాయాలు

- ఘోర రైలు ప్రమాదంలో జిల్లావాసి మృతి.. మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు
- యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా ఘటన
- కోరమండల్‌కు జిల్లాలో హాల్ట్ లేకపోవడంతో తగ్గిన ప్రాణనష్టం
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం



ఒడిశాలోని బాలాసోర్ జిల్లా బాహనాగా బజార్ రైల్వే స్టేషన్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల సహాయక చర్యలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం మహా విషాదంగా మారింది. దేశంలోనే మూడో అతిపెద్ద రైల్వే ప్రమాదంగా మారిన ఒడిశాలో మూడు రైళ్ల ప్రమాద ఘటనతో యావత్తు దేశం ఉలిక్కిపడింది. ఇంతటి ఘోర ప్రమాదానికి గురైన రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా మన జిల్లాను దాటుకునే వెళ్తుంటాయి. ప్రమాదం జరిగిన వెంటనే మన జిల్లావాసులు ఏమైనా చిక్కుకున్నారా.. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నారా.. అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరిలోనూ రేకెత్తాయి. ఘటన అనంతరం అంతా టీవీలకే అతుక్కుపోయారు. స్వల్పంగా నష్టం జరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటన జరిగిన కొన్ని గంటల నుంచే స్థానిక జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎవరైనా సంప్రదించేలా చర్యలు చేపట్టింది. ప్రమాదంలో మృతులు, క్షతగాత్రుల వివరాలన్నీ దాదాపుగా ఖరారుకావడంతో పాటు ఈ రెండు రైళ్లలోనూ హాల్ట్ స్టేషన్ల వారీగా ఎక్కిన వారు, దిగిన వారి పేర్లతో సహా వివరాలను ఇప్పటికే రైల్వే శాఖ అధికారులు విడుదల చేశారు. శనివారం సాయంత్రానికి వెలువడ్డ వివరాల మేరకు జిల్లాలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఇద్దరు మహిళలు గాయపడ్డారు.

హాల్ట్ లేకపోవడంతో..

స్థానిక జిల్లా నుంచి అటు తెలంగాణ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, ఒడిశా తదితర రాష్ట్రాలకు వివిధ వ్యాపార సంబంధాల క్రమంలో జిల్లా నుంచి ఎంతో మంది రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే షాలీమార్ నుంచి చెన్నై వెళ్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు జిల్లా మొత్తం మీద హాల్ట్ లేదు. దీంతో జిల్లా వాసులు ఈ ఎక్స్‌ప్రెస్ ఎక్కే అవకాశమే లేదు. దీంతో చాలా పెద్ద ఊరటే అని చెప్పాలి. అయినప్పటికీ బెంగళూరు నుంచి హౌరా వెళ్తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ మాత్రం శుక్రవారం మధ్యాహ్నం శ్రీకాకుళం రోడ్డులో మధ్యాహ్నం 2 గంటలకు, పలాస స్టేషన్లలో మధ్యాహ్నం 3 గంటలకు ఆగి ఒడిశా మీదుగా వెళ్లింది. జిల్లాకు చెందిన 16 మంది ప్రయాణికులు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో ఈ రైలెక్కారని అధికారులు వివరాలను ప్రకటించారు. పలాస స్టేషన్‌లో ఎక్కిన గురుమూర్తికి మృత్యువు వెంటాడింది. ఎల్లమ్మ అనే మహిళకు రెండు చేతులు విరిగిపోయాయి, మరో మహిళ గాయపడింది. ఆ రైలులో కేవలం చివరిలో ఉండే బోగీలు ప్రమాదానికి గురికావడంతో ముగ్గురు మాత్రమే ప్రమాదానికి గురయ్యారు. మరోవైపు యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో రాకపోకలకు మన జిల్లావాసులు పెద్దగా ప్రాధాన్యమివ్వరు. గత ప్రయాణికుల రికార్డులను బట్టి చూస్తే..అర్ధరాత్రి వేళల్లో గమ్యం చేరుతున్న రైళ్లకు జిల్లా వాసులు పెద్దగా ప్రాధాన్యతిచ్చే సందర్భాలు తక్కువనే చెప్పాలి. దీంతో శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కిన ప్రయాణికులు కూడా మార్గమధ్యలో అంటే పలాస, బరంపురం తదితర స్టేషన్లలోనే దిగిఉంటారని తెలుస్తోంది. ఏమీ లేదనుకున్నా జిల్లాకి చెందిన వారిలో ఒక్కరికి మృత్యువు వెంటాడగా.... ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి.

మత్స్యకారుడు మృతి



చోడిపిల్లి గురుమూర్తి



చికిత్స పొందుతున్న ఎల్లమ్మ

సంతబొమ్మాళి: ఒడిశాలో శుక్రవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో సంతబొమ్మాళి మండలం మత్స్యలేశ జగన్నాథపురం గ్రామానికి చెందిన వలస మత్స్యకారుడు చోడిపిల్లి గురుమూర్తి (65) మృతి చెందారు. బాలాసోర్ సమీపంలో సముద్రంలో చేపల వేట సాగిస్తూ వలస మత్స్యకారుడిగా కుటుంబంతో జీవిస్తున్నాడు. వృద్ధాప్య పింఛన్ అందుకోవడానికి మే 29వ తేదీన స్వగ్రామమైన మత్స్యలేశ జగన్నాథపురం గ్రామానికి వచ్చాడు. ఒకటో తేదీన పింఛన్ అందుకుని బాలాసోర్ వెళ్లడానికి పలాస రైల్వే స్టేషన్‌లో శుక్రవారం యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. కొద్ది గంటల్లో రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. అలాగే ఎం.కొత్తూరు గ్రామానికి చెందిన కారాడ ఎల్లమ్మ బాలాసోర్ రైలు ప్రమాదంలో రెండు చేతులు విరిగిపోయి తీవ్రమైన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈమె బతుకు తెరువు కోసం బాలాసోర్ వెళ్లడానికి పలాస రైల్వే స్టేషన్‌లో యశ్వంత్‌పూర్ రైలు ఎక్కింది.

రైల్వే నివేదికల ప్రకారం..	
యశ్వంత్‌పూర్–హౌరా రైలులో విశాఖకు చెందిన ప్రయాణికులు	33
ఇందులో సురక్షితం	17
టికెట్టు తీసుకుని ప్రయాణించని వారు	5
ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తున్న ప్రయాణికులు	7
కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలులో విశాఖ ప్రయాణికులు	309
ఇందులో సురక్షితం	165
టికెట్ తీసుకుని ప్రయాణించని వారు	57
ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తున్న ప్రయాణికులు	25
ఫోన్ నుంచి ఆన్సర్ రాని వారు	48

స్వల్ప గాయాలతో బయటపడి..

పోలాకి: మండలంలోని కొత్తరేవు గ్రామానికి చెందిన తయి అను(35) అనే మహిళ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో బంధువులతో కలిసి ప్రయాణం చేస్తుండగా ప్రమాదంలో గాయాలపాలైంది. రైల్వేసిబ్బంది ఆమెను బాలేశ్వర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అను క్షేమంగానే వున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. కుటుంబసభ్యులు సైతం ఆమెకు అందుబాటులోకి వచ్చినట్లు కొత్తరేవు వీఆర్వో శంకర్ తెలిపారు.

లాభాం వాసులకు తప్పిన ప్రమాదం

బూర్జ: మండలంలోని లాభాం గ్రామానికి చెందిన మెట్ట చంద్రమౌళి కొంతకాలంగా రేణిగుంట రైల్వే స్టేషన్‌లో స్టేషన్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భార్య లీలావతి, ఇద్దరు పిల్లలు తేజ, సాల్విలతో కలిసి వేసవి సెలవుల్లో నేపథ్యంలో హౌరా వెళ్లేందుకు ప్లాన్ చేశారు. వీరితో కలిసి మరికొందరు కూడా వెళ్లేందుకు ప్రణాళిక రూపొందించుకుని యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు టికెట్ సైతం రిజర్వేషన్ చేసుకున్నారు. అయితే చివరి నిమిషంలో స్నేహితులు రాకపోవడం, శ్రీకాకుళం జిల్లాలో బంధువుల వివాహం ఉండటంతో చంద్రమౌళి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రేణిగుంటలో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి శుక్రవారం ఆమదాలవలస రైల్వే స్టేషన్‌లో దిగిపోయారు. ఇంతలో రైలు ప్రమాదం జరగడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు.

ఘటనా స్థలికి జిల్లా అధికారులు



ఘటనా స్థలంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్, జేసీనవీన్, ఏపీసీ జయప్రకాష్



కలెక్టరేట్ కంట్రోల్ రూంలో సమాచార సేకరణలో రెవెన్యూ అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్/కాశీబుగ్గ: ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలోని బహానగర్ వద్ద ప్రమాదానికి గురైన ప్రాంతానికి జిల్లా యంత్రాంగం చేరుకుంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్, జిల్లాకు సంబంధించిన రెవెన్యూ, మెడికల్ బృందాలకు, సహాయక బృందాలకు పలు సూచనలు జారీ చేశారు. ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు సమగ్ర శిక్ష ఏపీసీ జయప్రకాష్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఈశ్వర ప్రసాద్, తహసీల్దారు ఎస్.గణపతిరావు, డాక్టర్ సుధీర్, డాక్టర్ భగవాన్‌దాస్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఆఫీసర్ ఎం.అనిల్ కుమార్, 13 మంది రెవెన్యూ బృందం వెళ్లింది. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 08942 240557, 08942– 286213 / 286245 నంబర్లను సంప్రదించి సమాచారం తెలియజేయవచ్చు. డీఆర్‌ఓ మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్

శ్రీకాకుళం క్రైమ్ : ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో జిల్లా వాసులు ఎవరైనా ఉంటే వివరాలు తెలుసుకోవడానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జి.ఆర్.రాధిక శనివారం తెలిపారు. క్షేమ సమచారం తెలుసుకునేందుకు, వివరాలు తెలియజేసేందుకు 9908756978 (కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్), 6309990837, 6309990933 (కంట్రోల్ రూం) నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ప్రమాద స్థలికి ఇరవై 108 అంబులెన్సులు



108 వాహనాలతో సిబ్బంది

రణస్థలం: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద స్థలానికి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 108 వాహనాలు 20 బయలుదేరాయని శ్రీకాకుళం డీఎం నజీర్ హుస్సేన్ తెలిపారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైలు ప్రమాద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఉమ్మడి విజయనగరం నుంచి 8, శ్రీకాకుళం నుంచి 8, విశాఖపట్నం నుంచి 4 వాహనాలు శనివారం మధ్యాహ్నం బయలుదేరి వెళ్లాయని చెప్పారు. ఒడిశా ప్రభుత్వ సూచనల మేరకు శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ నేతృత్వంలో సహాయక చర్యల్లో పాల్గొంటామని చెప్పారు.

రైల్వే ప్రయాణికులకు రెడ్‌క్రాస్ సేవలు



ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న రెడ్‌క్రాస్ అధ్యక్షుడు జగన్మోహనరావు, సిబ్బంది

ఆమదాలవలస: ఒడిశాలో ఘోర రైలు ప్రమాదం జరిగిన నేపథ్యంలో పలు రైళ్లను ఆలస్యంగా నడిపిస్తూ ఎక్కడికక్కడ నిలుపుదల చేశారు. ఈ క్రమంలో శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస)రైల్వేస్టేషన్‌లో శనివారం ఆగిన రైలులో ప్రయాణికులకు రెడ్‌క్రాస్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో రొట్టెలు, మజ్జిగ, పాలు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగువారి కోసం వెతుకులాట



ఎస్‌ఈజీబీ మెడికల్ కళాశాల వద్ద పలాస డివిజన్ తహశీల్దార్ల బృందం

కాశీబుగ్గ: ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో తెలుగువారు ఉన్నారేమో అని సంశయంతో వారిని వెతకడానికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా తహశీల్దార్ల బృందం బయలుదేరి వెళ్లింది. పలాస నుంచి బయలుదేరిన ఈ బృందంలో పలాస తహశీల్దార్ లంబాల మధుసూదన రావు, ఇచ్ఛాపురం తహశీల్దారు గురుప్రసాద్, మందస తహశీల్దారు బడే పాపారావులు ఒడిశాలోని ఆసుపత్రులకు చేరుకున్నారు. కటక్‌లో ఉన్న 193 మృతదేహాలను పరిశీలించగా తెలుగు వారు లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. బాలాసోర్, ఇతర ప్రాంతాల ఆస్పత్రులకు వెళ్లి పరిశీలిస్తున్నారు. ఆదివారం నాటికి పూర్తి స్పష్టత వస్తుందని తెలిపారు.

నాలుగు ప్రత్యేక బస్సుల ఏర్పాటు

కాశీబుగ్గ: రైలు ప్రమాదంలో క్షతగాత్రుల అవసరాల నిమిత్తం పలాస కాంప్లెక్స్‌లో నాలుగు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి డిపో మేనేజర్ పినకాన సంతోష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా, రైళ్ల రద్దు నేపథ్యంలో ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి ప్రాంతాల నుంచి విశాఖపట్నానికి అదనంగా బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 12.30 నుంచి 5.30 వరకు రెండో షిఫ్టులో పరీక్షలు నిర్వహిస్తారు. శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 360 మంది, శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో 280 మంది పరీక్షకు హాజరుకానున్నారు.

విద్యుత్ శాఖ ఇంజినీర్లకు బదిలీలు

అరసవల్లి : విద్యుత్ శాఖలో పలువురు ఏఈలకు బదిలీలు అయ్యాయి. అనకాపల్లి ఏఈ అంగ శ్రీనివాసరావు శ్రీకాకుళం రూరల్ ఏఈగా, విజయనగరం ఏఈ అరవల శ్రీనివాసరావు గార మండల విద్యుత్ ఏఈగా నియమితులయ్యారు. కోటబొమ్మాళి ఏఈగా జి.వి.సురేష్, సంతబొమ్మాళి ఏఈగా చెక్క కనకరాజు, పలాస ఏఈగా ఎల్.వెంకటరమణ, పాలకొండ ఏఈగా శ్యామసుందర్ సాహు, నందిగాం ఏఈగా వై.శ్రీనివాసరావు, నరసన్నపేట రూరల్ ఏఈగా డి.సురేష్‌లను నియమించారు. వీరంతా త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

పిడుగుపాటుకు 20 మూగజీవాలు బలి



మృతిచెందిన మేకల వద్ద బాధితులు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకు 20 మేకలు మృతిచెందాయి. పెద్దచెరువు సమీపంలో మంద మేపుతుండగా ఒక్కసారిగా వాన మొదలైంది. గట్టుపైకి వెళ్తున్న క్రమంలో పిడుగు పడటంతో మద్ది రామమూర్తికి చెందిన 11 మేకలు, బొల్లమల్లేసుకు చెందిన ఆరు మేకలు, వంజరాపు తాతయ్యకు చెందిన 3 మేకలు మృత్యువాతపడ్డాయి. లక్షల రూపాయలు విలువైన మూగజీవాలు మృతిచెందడంతో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: జిల్లాలోని 11 మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు, బాలికలు)ల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జల్లు లక్ష్మణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6లోగా దరఖాస్తులు స్వీకరిస్తామని, 9న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో అక్కుపల్లి, సంతబొమ్మాళి, నరసన్నపేట, కోటబొమ్మాళి, అంపోలు, లోలుగు, పలాస, పాతపట్నం, టెక్కలి, శ్రీకాకుళం హయాతీనగరం, ఆమదాలవలస తదితర ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.

108లో గర్భిణి ప్రసవం



పండంటి బిడ్డకు జన్మనిచ్చిన మణి

జి.సిగడాం: మండలంలోని బొడ్డవలస గ్రామానికి చెందిన గర్భిణి బి.మణికి శనివారం పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి గ్రామస్తులు సమాచారం అందించారు. సిబ్బంది సతీష్‌కుమార్, ఎల్ఎన్ మూర్తి వెంటనే గ్రామానికి చేరుకుని రాజాం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మణికి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు.

చంద్రబాబుకు ఎందుకంత కడుపుమంట?

● డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి. చిత్రంలో మంత్రి మేరుగ నాగార్జున

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కుల, మతాలు, పార్టీల కతీతంగా సంక్షేమాన్ని అందించేందుకు నవరత్నాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు అందిస్తుంటే.. తట్టుకోలేని చంద్రబాబు అండ్ కో కోర్టుల కెక్కి అడ్డుకోవాలని చూడటం సరికాదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. చంద్రబాబు దృష్టిలో పేదలంటే ఈనాడు రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణ, మాజీ మంత్రి నారాయణ, టీవీ–5లేనని మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఆర్అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం మంత్రి మేరుగ నాగార్జునతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ చంద్రబాబు దగ్గర పడిగాపులు కాసి ఉండాల్సిన అవసరం పవన్‌కల్యాణ్‌కు ఏముందని ప్రశ్నించారు. 'మనుషులుగా పుట్టాలనుకునేవారు దళితులుగా పుడతారా..' అనే చంద్రబాబు వ్యాఖ్యలు దళితులెవ్వరు మరిచిపోలేదన్నారు. రూ.2లక్షల 50 వేల కోట్లు నిధుల ను డీబీటీ ద్వారా రాష్ట్ర ప్రజానీకం ఖాతాల్లో పైసా అవినీతి లేకుండా జమ చేశారని గుర్తు చేశారు.

సీఎం హామీ శుభపరిణామం..

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ దళితులపై దాడులు జరిగితే ఎంతటి వారైన తక్షణ చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇవ్వడం శుభపరిణామమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి, ముంజేటి కృష్ణ, కంఠ వేణు, తైక్వాండో శ్రీను, యజ్జల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

ఆమదాలవలస : ఒడిశాలో శుక్రవారం జరిగిన రైలు ప్రమాదం కారణంగా శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ మీదుగా నడవాల్సిన పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. రైలు నంబర్లు 22504, 2644, 12508 దారి మళ్లించినట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి ఈ రైళ్లలో ప్రయాణం చేయాల్సిన ప్రయాణికులు విజయనగరం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కాలని సూచించారు. 12839, 12863, 12703 నంబర్ల గల రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. కాగా, రైళ్ల రద్దుతో ఆమదాలవలస బస్టాపులో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది.

క్లుప్తంగా

మృతునిది ఉర్లాం


లచ్చన్న (ఫైల్)

నరసన్నపేట: ఉర్లాం రైల్వే స్టేషన్ సమీపంలో జీఆర్పీ సిబ్బంది శుక్రవారం గుర్తించిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వివరాలు తెలిసినట్టు హెడ్‌కానిస్టే బుల్ మధుసూదనరావు శనివారం తెలిపారు. మృతుడు ఉర్లాం రజక వీధికి చెందిన రావులవలస లచ్చన్న (63)గా భార్య చిన్నమ్ముడు, కుటుంబ సభ్యులు గుర్తించినట్లు తెలిపారు. రజక వృతి చేసుకుంటూ జీవిస్తున్న లచ్చన్న సమీప నడగాం గ్రామానికి వెళ్లినప్పుడు దృష్టి లోపంతో పట్టాలవైపు వెళ్లడంతో రైలు ఢీకొని మృతి చెందినట్టు భావిస్తున్నామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

నెల రోజుల్లో తాత్కాలిక వంతెన నిర్మాణం


పనులను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

ఇచ్ఛాపురం: బాహుదానదిపై ఉన్న వంతెన ఇటీవల కూలిపోయింది. ఆ ప్రాంతంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న వంతెన పనులను నెల రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు చేపట్టామని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్ చెప్పారు. చేపడుతున్న పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నదికి ఇరువైపులా రిటర్నింగ్ వాల్స్‌ను ఏర్పాటుచేసి తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. వంతెన నిర్మాణం పూర్తయిన తరువాత కేవలం ద్విచక్ర వాహనాలు, ఆటోలకు మాత్రమే ప్రయాణించేందుకు అనుమతులిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈ ఎస్.రామినాయుడు, ఏఈ మోహన్‌రావు ఉన్నారు.

సక్రమంగా జేవీకే కిట్ల తరలింపు

● డీఈవో తిరుమల చైతన్య


జేవీకే కిట్లపై సిబ్బందితో మాట్లాడుతున్న తిరుమల చైతన్య

లావేరు: జగనన్న విద్యాకానుక కిట్లను సక్రమంగా పాఠశాలలకు తరలించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టరు ఎస్.తిరుమల చైతన్య సిబ్బందిని ఆదేశించారు. మండలం కేంద్రం లావేరులోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జేవీకే కిట్ల స్టాక్ పాయింట్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే అందరి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరానికి లావేరు మండలంలోనే 5,846 మంది విద్యార్థులకు జేవీకే కిట్లను అందిస్తామన్నారు. డీఈవో వెంట లావేరు ఎంఈవో ఎల్.ఈశ్వరరావు, ఎంఐఎస్ మండల కోఆర్డినేటర్ జి.చంద్రశేఖర్, సీఆర్పీలు ఉన్నారు.

కొండచిలువ హతం


హతమైన కొండచిలువ

కాశీబుగ్గ: కేశపురం గ్రామంలో భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. సమీపంలోని కొండ నుంచి జనావాసాల్లోకి వచ్చిన కొండచిలువ గొర్రెలు, మేకలశాలల వద్ద సంచరిస్తుండగా గమనించిన కాపరులు భయాందోళన చెందారు. కర్రలతో అదిరించినా ప్రయోజనం లేకపోవడంతో కొట్టి హతమార్చారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,760–00
బంగారం(22సి. 10గ్రా.)	55,700–00
వెండి (కిలో)	77,600–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ.519.00
శ్రీకాకుళం	రూ.519.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹ 284

కొత్త విద్యుత్ డివిజనల్ కేంద్రంగా పలాస

● శ్రీకాకుళం నగరంలో కొత్తగా డీ–4 సెక్షన్ ఏర్పాటు
● విశాఖలోని క్వాలిటీ కంట్రోల్ డివిజన్ శ్రీకాకుళంలో ఏర్పాటు
● సిబ్బంది నియామకాలు పూర్తి చేసిన అధికారులు
● మరింత విస్తరించనున్న విద్యుత్ సేవలు


కొత్త సెక్షన్ ఏర్పాటుపై ఈఈలతో చర్చిస్తున్న ఎస్‌ఈ దైవప్రసాద్

అరసవల్లి: విద్యుత్ శాఖ సేవలు మరింత విస్తరించనున్నాయి. ఇప్పటికే విద్యుత్‌పరంగా శ్రీకాకుళం సర్కిల్‌లో మంచి పటిష్ట వ్యవస్థ ఉన్నప్పటికీ ఇంకా మారుమూల ప్రాంతాల్లో పర్యవేక్షణ లోపంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాల విభజన ప్రక్రియ అనంతరం కొత్తగా సెక్షన్లు, డివిజనల్ కేంద్రాల ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) వెంటనే చర్యలకు దిగింది. దీనిలో భాగంగా జిల్లాలో కొత్తగా పలాస పట్టణం కేంద్రంగా డివిజనల్ కార్యాలయాన్ని ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ఇక్కడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పర్యవేక్షణలో అన్ని సబ్ డివిజన్లు, సెక్షన్ల అధికారులు పనిచేయనున్నారు. ఫలితంగా క్షేత్ర స్థాయిలో విద్యుత్ సరఫరా, అంతరాయాలు, ఇతరత్రా ఇబ్బందులు తొలగనున్నాయి. మరోవైపు ప్రకృతి ప్రకోపాలకు ఎక్కువగా ఉద్దాన ప్రాంతంలోనే విద్యుత్ శాఖకు భారీగా నష్టం కలుగుతోంది. ఈ నేపథ్యంలో పలాస కేంద్రంగా విద్యుత్ శాఖ అధికారులు వెంటవెంటనే నిర్ణయ చర్యలకు దిగడం గానీ...ముందస్తు చర్యలు, పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఉద్యోగుల బదిలీల్లో భాగంగా విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ఈఈ స్థాయిలో పనిచేస్తున్న జి.ప్రసాద్‌ను పలాస డివిజనల్ ఈఈగా నియమిస్తూ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడే డిప్యూటీ ఈఈగా సీహెచ్‌వి.రమణారావును నియమించారు.

9 మండలాలు, 10 సెక్షన్లతో..

ఇంతవరకు టెక్కలి విద్యుత్ డివిజనల్ కార్యాలయ పరిధిలో ఉన్న పలాసను విడదీసి సోంపేట, పలాస, పాతపట్నం సబ్‌డివిజన్లను కలుపుతూ కొత్తగా పలాస డివిజన్‌ను ఏర్పాటు చేశారు. దీని పరిధిలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, పలాస–కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు, మందస, పాతపట్నం, మెళియాపుట్టి తదితర తొమ్మిది మండలాలతో (కాశీబుగ్గతో కలిపి 10 సెక్షన్లు) కొత్త డివిజనల్ కార్యాలయం ఏర్పాటైంది. ఇక టెక్కలి డివిజన్‌లో నరసన్నపేట, టెక్కలి, కోటబొమ్మాళి సబ్‌డివిజన్లు, అలాగే నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, సారవకోట, కోటబొమ్మాళి, జలుమూరు, నరసన్నపేట టౌన్, పోలాకి తదితర 11 మండలాలతో (నరసన్నపేట రూరల్‌తో కలిపి 12 సెక్షన్లు) టెక్కలి డివిజనల్ కార్యాలయం పనిచేయనుంది. దీంతో మొత్తం విద్యుత్ సర్కిల్ పరిధిలో శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండతో పాటు పలాస ఈఈ కేంద్రాలు పనిచేయనున్నాయి. శ్రీకాకుళం డివిజనల్ కార్యాలయ పరిధిలో ఆమదాలవలస, శ్రీకాకుళం టౌన్, శ్రీకాకుళం రూరల్ సబ్‌డివిజన్లు, పాలకొండ డివిజనల్ కార్యాలయ పరిధిలో పాలకొండ, సీతంపేట, రాజాం సబ్‌డివిజన్లు ఎప్పటిలాగానే పరిధిలో ఉన్నాయి.

జిల్లా కేంద్రంలో కొత్త సెక్షన్..

శ్రీకాకుళం నగరం పరిధిలో విద్యుత్ శాఖ పరంగా ప్రస్తుతానికి డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లుగా డి–1, డి–2, డి–3 సెక్షన్ల కార్యాలయాలు పనిచేస్తున్నాయి. ఇప్పుడు నగరం మరింత విస్తరించడంతో పాటు మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు పంచాయతీలు విలీనం కావడంతో విద్యుత్ వినియోగదారుల సర్వీసులు భారీగా పెరిగాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని సర్కిల్ ఎస్‌ఈ ఎల్.దైవప్రసాద్, శ్రీకాకుళం డివిజనల్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడుల బృందం, మరొక కొత్త సెక్షన్‌ను ప్రతిపాదిస్తూ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయానికి నివేదికను పంపించారు. దీనికి ఇటీవలే ఆమోదం రావడంతో నగరంలో కొత్తగా డి–4 పేరిట కొత్త సెక్షన్‌ను ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. నగరం పరిధితో పాటు సమీపంలో ఎచ్చెర్ల పరిధిలోని మొత్తం 90 వేలమంది వరకు విద్యుత్ వినియోగదారులు డి–1, డి–2, డి–3 సెక్షన్ల పరిధిలో ఉన్నారు. కిల్లిపాలెం, చాపురం, పాత్రునివలస, పెద్దపాడు, తోటపాలెం తదితర విలీన పంచాయతీల నుంచి సుమారు 15 వేలకు పైగా వినియోగదారులు కలవడంతో వీరితో పాటు నగరంలో మరికొన్ని ప్రాంతాలను కలుపుకుని ఈ కొత్త సెక్షన్‌గా డి–4ను ప్రారంభించనున్నారు. ఇంతవరకు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు ఉమ్మడిగా క్వాలిటీ కంట్రోల్ డివిజనల్ కార్యాలయం ఇంతవరకు విశాఖపట్నంలో ఉండేది. తాజా మార్పుల్లో భాగంగా ఇదే కార్యాలయాన్ని శ్రీకాకుళం కేంద్రంగానే ఏర్పాటు చేస్తున్నారు. తాజా నిర్ణయాలతో విద్యుత్ వినియోగదారులు మరింత నాణ్యమైన సేవలు పొందే అవకాశముంది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

● ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్


ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గత నెల 15వ తేదీ నుంచి పర్యావరణ పరిరక్షణకు సంబంధించి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అవగాహన ర్యాలీని శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోజు వారి జీవితంలో మార్పులు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. మన అలవాట్లను పర్యావరణ హిత జీవనశైలికి అనుకూలంగా మార్చుకొని అదే జీవనశైలికి అలవర్చుకోవాలన్నారు. గ్లోబలైజేషన్ తర్వాత కాలుష్యం విపరీతంగా పెరిగి మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రజలందరూ పర్యావరణంపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. కాలుష్య కారణాలను తగ్గించాలని చెప్పారు. మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ సెహర్‌లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నేను, నా కుటుంబం, స్నేహితులు, ఇతరులకు పర్యావరణ హిత జీవనశైలి ప్రాముఖ్యతను గురించి వివరించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా జీవనశైలిని మార్చుకోవడానికి, పర్యావరణానికి విఘాతం కలుగకుండా ఉండేందుకు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని మే నెల 15వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నాగావళి తీరంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించి తీరాన్ని శుభ్రం చేశారు. క్లీనింగ్ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్‌నవీన్ పాల్గొని యువతలో స్ఫూర్తినింపారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్ నాయక్, పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, టూరిజం యువక్లబ్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, రోటరీ క్లబ్ సభ్యులు జోగినాయుడు, వెంకటస్వామి, హారిక ప్రసాద్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన బైక్


ప్రమాదానికి కారణమైన కారు

పొందూరు: గారపేట సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మణరావు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా నుంచి చిలకపాలెం మీదుగా రాజాం వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కారు సడన్ బ్రేక్ వేసే సరికి మరో బైక్ కారును వెనుకనుంచి వచ్చి ఢీకొట్టింది. మెట్టవలస నుంచి పొందూరు మీదుగా మురపాకకు వండాన సిమ్మినాయుడు, వండాన సరస్వతి బైక్‌పై వెళ్తుండగా గారపేట సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వారిరువురికీ గాయాలు కాగా అదే సమయంలో కారు వెనుక మరో బైక్‌పై వస్తున్న గుంటుకు సంతోష్, సూర్యకాంతలు ప్రమాదానికి గురైయ్యారు. గాయపడిన నలుగురుని శ్రీకాకుళం రిమ్స్‌కు 108 వాహనంలో తరలించారు.

ఖైదీల స్థితిగతులపై సమీక్ష


జైలు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా జైలులో ఉన్న ఖైదీల పరిస్థితులు, బెయిల్ మంజూరు తదితర అంశాలపై శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా శనివారం ఆయన చాంబర్‌లో జైలు అధికారులతో సమీక్షించారు. ఖైదీల కేసులు, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు

ఎస్‌వోపీ రికవరీలు చేయడం తగదు


ఎస్‌ఈ దైవప్రసాద్‌కు నోటీసు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

● విద్యుత్ శాఖ ఎస్‌ఈకి నిరసన నోటీసు ఇచ్చిన ఇంజినీర్ల జేఏసీ

అరసవల్లి: స్టాండర్డ్స్ ఆఫ్ పెర్ఫార్మెన్స్ (ఎస్‌వోపీ)లో భాగంగా సిటిజన్ చార్టర్ ప్రకారం నిర్ణీత వ్యవధిలో వినియోగదారునికి సేవా జాప్యానికి గాను..ఆయా ఇంజినీర్ల నెలవారీ జీతాల నుంచి ఈపీడీసీఎల్ యాజమాన్యం రికవరీలు చేయడం తగదని విద్యుత్ శాఖ ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం స్థానిక ఎస్‌ఈ ఎల్.దైవప్రసాద్‌కు ఇంజినీర్ల సంఘాల ప్రతినిధుల జేఏసీ బృందం నిరసన తెలియజేస్తూ నోటీసును అందజేశారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ పరంగా వినియోగదారునికి సకాలంలోనే సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అయితే ఏవైనా కారణాల వల్ల జాప్యం జరిగితే వాటిని పరిగణనలోకి తీసుకుని ఎస్‌వోపీ రికవరీస్ పేరిట జీతాల్లో కోతలు విధించడం దారుణమన్నారు. మే నెల జీతంలో చాలా మంది ఇంజినీర్లకు కోత విధించడం తగదన్నారు. యాజమాన్యం పునరాలోచించి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని..లేదంటే తమ నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఈబీ ఇంజినీర్ల సంఘం బ్రాంచ్ సెక్రటరీ ఎస్.శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్స్ సంఘ బ్రాంచ్ సెక్రటరీ జి.వి.సురేష్, ఏపీ పవర్ డిప్లమో ఇంజినీర్స్ సంఘ సర్కిల్ సెక్రటరీ జె.సురేష్‌కుమార్, ఏపీ పవర్ ఇంజినీర్స్ సంఘ సర్కిల్ సెక్రటరీ ఎంఎస్ ప్రసాద్, ఈఈలు ఎస్.బయ్యన్నాయుడు, ఎల్‌సీహెచ్ పాత్రుడు, డిప్యూటీ ఈఈలు చల్లా వెంకటేశ్వరరావు, జి.సురేష్, కె.విష్ణుమూర్తి ఉన్నారు.

పరీక్ష ఫలితాలు విడుదల చేయాలి

● డయల్ యూవర్ వర్సిటీలో విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పరీక్షలు నిర్వహించిన తరువాత సకాలంలో ఫలితాలు విడుదల చేయాలని విద్యార్థులు కోరారు. వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో నెలలో ప్రతి మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమాన్ని ఈ వారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ సమస్యలు చెప్పుకున్నారు. డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాల విడుదలపై విద్యార్థులు ఎక్కువగా ప్రశ్నించారు. త్వరలో విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. డిగ్రీ మొదటి, మూడు, ఐదు సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలపై కూడా ప్రశించారు. రెండు వారాల్లో ఫలితాలు ప్రకటించనున్నట్లు వర్సిటీ అధికారులు స్పష్టం చేశారు. డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ రీవాల్యూయేషన్ ఫలితాలపై విద్యార్థులు ప్రశ్నించగా వీటిని కూడా వారంలోగా వెల్లడిస్తామన్నారు. కోర్సులు, ప్రవేశాలపై పలువురు విద్యార్థులు ప్రశ్నించగా వర్సిటీ వెబ్ సైట్‌లో ప్రతి సమాచారం పొందుపరుస్తున్నట్టు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్, సీడీసీ డీన్ పీలా సుజాత, రీవాల్యూయేషన్ డీన్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

కొట్లాటపై కేసు నమోదు

టెక్కలి రూరల్: బూరగాం గ్రామంలో స్థలం విషయమై జరిగిన కొట్లాటకు సంబంధించి కేసు నమోదు చేసినట్టు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి తన స్థలానికి సంబంధించి అదేగ్రామానికి చెందిన డి.చంద్రమోహన్‌రెడ్డితో గొడవలున్నాయి. దానిలో భాగంగా సబ్‌కలెక్టర్‌ను ఆశ్రయించగా స్థలాన్ని సర్వే చేసి రాళ్లు పాతమని ఆదేశించారు. దీంతో స్థలంలో సుధాకర్‌రెడ్డి రాళ్లు పాతుతుండగా శనివారం రాత్రి చంద్రమోహన్‌రెడ్డి వాటిని తొలగించారు. ఈ విషయమై అడిగిన సుధాకర్‌రెడ్డితో పాటు మరొకరిపై చంద్రమోహన్‌రెడ్డి దాడి చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో చంద్రమోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పుస్తెలతాడు చోరీ

నందిగాం: పెద్దలవునిపల్లి పంచాయతీ చిన్నిలవునిపల్లిలో చోరీ జరిగింది. నిద్రిస్తున్న తన మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడును దొంగ తెంచుకొని పరారయ్యారని గురుజు భారతమ్మ ఫిర్యాదు చేసినట్టు పోలీసులు శనివారం తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి తన మెనలో పుస్తెలతాడుని తెంచుకొని పరారవుతుండడంగా తేరుకొని కేకలు వేసినట్టు చెప్పారు.

ఏటీఎం అద్దాలు ధ్వంసం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డులో ఎస్‌పీవీ ఆసుపత్రి ఎదురుగా హెచ్‌డిఎఫ్‌సీ ఏటీఎం అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. గొడవ జరిగిందా? కావాలనే ధ్వంసం చేశారా తెలియాల్సి ఉంది. ఏటీఎం సెంటర్‌కు వచ్చిన ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు.

వ్యాపార కేంద్రంలో అగ్ని ప్రమాదం

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం సింహద్వారం సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు వ్యాపార కేంద్రంలో శనివారం రాత్రి 10.40 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్టు జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి వరప్రసాదరావు తెలిపారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక శకటం, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారన్నారు. అయితే అగ్నిమాపక వారోత్సవాల సమయంలో వ్యాపార కేంద్రం సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో ప్రమాద సమయంలో అలారం మోగిన వెంటనే అప్రమత్తమై వారే మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. ఈ ఘటనలో కొన్ని దుస్తులు కాలిపోయినట్టు చెప్పారు.

శ్రీముఖలింగంలో మైనాకోత్సవం


మైనాకోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామివారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా జేష్టమాసం ఐదో శనివారాన్ని పురస్కరించుకొని స్వామివారికి మైనాకోత్సవం ఘనంగా జరిగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా హోమం బలిహరణ అనంతరం పార్వతీపరమేశ్వరులకు తిరువీధి చేపట్టారు. పార్వతీపరమేశ్వరుల వివాహ మహోత్సవం నచ్చని మైనాకుడు స్వామివారి గృహాన్ని దహనం చేస్తాడు. ఈ కార్యక్రమాన్ని మైనాకోత్సవంగా నిర్వహించడం సంప్రదాయంగా పరగణిస్తారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.